హైదరాబాద్ వార్త



# హద్దు మీరొద్దు!



**-న్యూఇయర్ వేడుకలపై పోలీసుల డేగకన్ను**
**-హంగామా సృష్టిస్తే కఠిన చర్యలు**
**-అనుమానిత డీజేలపై మఫ్టీ నిఘా**
**-పబ్బులు, బార్లు, ఓయో రూముల్లో తనిఖీలు**
**-ప్రత్యేక బృందాల ద్వారా నిరంతర పర్యవేక్షణ**

**హైదరాబాద్, డిసెంబరు 26,ప్రభాతవార్త:** నగరం నయా సాల్ వేడుకలకు సిద్ధమవుతోంది. పబ్‌లు, క్లబ్‌లు, కన్వెన్షన్ సెంటర్స్, స్టార్ హోటల్స్.. ఇలా ఒకటేమిటి మరెన్నో వేదికలు ఆర్ యూ రెడీ అంటూ ఆహ్వానిస్తున్నాయి. న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో నగరవ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా... మాదకద్రవ్యాల విక్రయం, వినియోగానికి చెక్ చెప్పేందుకు సిటీ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. డ్రగ్స్ ను అరికట్టేందుకు టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య నేతృత్వంలో డ్రగ్స్ హాట్ స్పాట్ లో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. తెలంగాణలోకి డ్రగ్స్ రాకుండా గోవా, ఢిల్లీ, ముంబై, బెంగళూరులో మఫ్టీలో టీమ్స్ ఏర్పాటు చేసింది. అలాగే టీజీ న్యాబ్ రాడార్ పరిధిలో పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టింది. డార్క్ వెబ్ సైట్లపై సాంకేతికంగా ఫోకస్ పెట్టింది. న్యూ ఇయర్ వేడుకల కట్టడి కోసం 1200 డ్రగ్స్ యూరిన్ కిట్లు, 800 సలైవా డ్రగ్స్ టెస్ట్ కిట్లు, 20 డాగ్స్ స్క్వాడ్ టీమ్స్ స్క్వాడ్ టీంతో నిరంతరం చెకింగ్స్ చేసేందుకు రెడీ అవుతోంది. డిసెంబర్ 31 రాత్రి వేడుకలు ముగిసే వరకు నిరంతరం తనిఖీలు చేయనున్నట్లు టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ పరిధిలో ఎక్సైజ్ డిపార్ట్మెంట్ తో కలిసి ప్లాన్ రూపొందించినట్లు తెలిపారు. ట్రై కమిషనరేట్ పరిధిలోని ప్రతి పబ్, బార్ అండ్ రెస్టారెంట్స్, ఫాంహౌస్, రిసార్టులతో పాటు ప్రైవేట్ హోటల్ రూమ్స్, గెస్ట్ హౌజ్ లలో కూడా సోదాలు చేస్తామన్నారు. ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నట్లు తేలినా కఠిన చర్యలు తీసుకుంటామన్నామని అలాగే 21 సంవత్సరాల లోపు వారికి ఎవరైనా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. .

### అనుమానిత డీజేలపై నిఘా..

న్యూఇయర్ పార్టీల నేపథ్యంలో డ్రగ్స్ విక్రయం, వినియోగం పెరిగే అవకాశం ఉందని వెస్ట్‌జోన్ పోలీసులు అనుమానిస్తున్నారు. సిటీలో చిక్కిన డ్రగ్స్ విక్రేతలు, వినియోగదారుల్లో ఈ జోన్‌లో పట్టుబడిన వారే ఎక్కువ. దీన్ని దృష్టిలో పెట్టుకున్న అధికారులు గతంలో మాదకద్రవ్యాలు విక్రయిస్తూ (పెడ్లర్స్) అరెస్టయిన, ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న వారిని కట్టడి చేయాలని నిర్ణయించారు. వీరందరినీ ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం ద్వారా చెక్ చెప్పేందుకు స్పెషల్ టీమ్స్‌ను రంగంలోకి దింపారు. మరోపక్క గతంలో చిక్కిన ముఠాలు వెల్లడించిన వివరాలు, పోలీసులు సేకరించిన సమాచారం ప్రకారం కొన్ని పబ్స్‌లోని డీజేలు కూడా పెడ్లర్స్‌గా మారి వ్యవహారాలు సాగిస్తున్నట్లు గుర్తించారు. వీరిపై నిఘా వేయడానికి మఫ్టీ బృందాలు విధుల్లో ఉంటాయి. వీటితో పాటు శాంతి భద్రతల సమస్యలు రాకుండా చూసేందుకు క్విక్ రెస్పాన్స్ టీమ్స్ (క్యూఆర్టీ), ఈవ్‌టీజింగ్ కంట్రోలింగ్‌కు ప్రత్యేక బృందాలను మోహరిస్తున్నారు. పశ్చిమ మండలంతో పాటు నగర వ్యాప్తంగా అవసరమైన అన్ని ప్రాంతాల్లోనూ ఈ తరహా చర్యలు తీసుకుంటున్నారు. ఆయా కార్యక్రమాలు, వెన్యూల వద్ద ఉండే బౌన్సర్లు అతిగా ప్రవర్తించినా, ఆహూతులకు ఇబ్బందులు కలిగించినా వారితో పాటు ఏర్పాటు చేసిన సంస్థల పైనా చర్యలు తప్పవని స్పష్టం చేస్తున్నారు.

### ప్రత్యేక బృందాలు...

నిబంధనల పర్యవేక్షణ, నిఘా కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. వీరు కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో తనిఖీలు చేయడం, వాటిని చిత్రీకరించడంతో పాటు ఆడియో మెషిన్ల సాయంతో శబ్ద తీవ్రతనూ కొలుస్తారు. నగరంలోని మిగతా నాలుగింటితో పోలిస్తే పశ్చిమ మండలం పూర్తి విభిన్నమైంది. ఇది వీఐపీ జోన్ మాత్రమే కాదు... ఖరీదైన కుర్రకారు జోన్ కూడా. వీరి అత్యుత్సాహం నేపథ్యంలో పలు వేడుకలు సామాన్యులకు ఇబ్బందులు కలిగిస్తుంటాయి. ఈ నేపథ్యంలోనే ఇక్కడ కొన్ని అదనపు చర్యలు తీసుకుంటున్నారు. పోలీసులు నెక్లెస్‌రోడ్, కేబీఆర్ పార్క్ రోడ్, బంజారాహిల్స్ రోడ్ నెం.1, 2, 45, 36లతో పాటు జూబ్లీహిల్స్ రోడ్ నెం.10, సికింద్రాబాద్, మెహిదీపట్నం, గండిపేట దారుల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ రేసులు, డ్రంకెన్ డ్రైవింగ్ పైనా కన్నేసి ఉంచుతారు. బహిరంగ ప్రదేశాల్లో టపాసులు కాల్చడాన్ని నిషేధించనున్నారు. బయట ప్రాంతాలకు వెళ్లి పార్టీల్లో పాల్గొన్న వారు సాధ్యమైనంత త్వరగా ఇంటికి తిరిగి వెళ్లాలని సూచిస్తున్నారు. వాహనాల్లో ప్రయాణిస్తూ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.





# సిటీ అంతా చిరు జల్లులు

**-పెరిగిన చలి**

**హైదరాబాద్, డిసెంబరు 26 ప్రభాతవార్త**
బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో హైదరాబాద్‌లో పలుచోట్ల చిరు జల్లులు కురుస్తున్నాయి. అదేవిధంగా పొద్దున్న చలిగా ఉంటుంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట్, బేగంపేట్, తార్నాక, నారాయణగూడ, మూషీరాబాద్, హిమాయత్‌నగర్, అంబర్‌పేట, గోషామహల్, అబిడ్స్, సనత్‌నగర్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, కంటోన్మెంట్, నాంపల్లి, గోల్కొండ, ఎల్బీనగర్, ఉప్పల్, బోడుప్పల్, మల్కాజ్‌గిరి, మలక్‌పేట, ట్యాంక్ బండ్, ఖైరతాబాద్ తదితర ప్రాంతాలలో చిన్నపాటి జల్లులు కురిశాయి. అక్కడక్కడా కురిసిన జల్లులకు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాలు నిలిచిపోయాయి. జూబ్లీచెక్ పోస్ట్, అమీర్‌పేట్, పంజాగుట్ట, లక్డికాపూల్, హబ్సిగూడ, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయ్యింది. అల్పపీడన ప్రభావంతో తెలుగు రాష్ట్రాలలో రానున్న రెండు రోజులలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్ సహా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అక్కడక్కడ వర్షాలు పడుతున్నాయి. అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉందని, దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు, ముఖ్యంగా కోస్తా, రాయలసీమ జిల్లాలలో వర్ష కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

## ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం



ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం

**ధర్నాచౌక్, డిసెంబర్ 26, ప్రభాతవార్త:** సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హామీ ఇచ్చారు. రాష్ట్రంలో సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులు, గిరిజన సంక్షేమ శాఖలోని ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఈనెల 10నుండి సమ్మె బాట చేపట్టిన నేపథ్యంలో వారికి మద్దతుగా తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపిటిఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ అనిల్ కుమార్ అధ్యక్షతన గురువారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరై కోదండరాం మాట్లాడుతూ రెండు మూడు రోజులలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని, సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వ బాధ్యత కూడా ఉంది కాబట్టి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయించే విధంగా రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్స్‌పాల్ ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 75 ఏళ్లు గడిచిపోయినప్పటికీ ఉపాధ్యాయుల విషయంలో శ్రమ దోపిడీ కొనసాగటం దుర్మార్గమైన విధానమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాటాల ద్వారానే ప్రభుత్వాలు దిగివచ్చి, సమస్యలు పరిష్కరిస్తాయని, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు టీపీటీఎఫ్ లాంటి సంస్థలు అండగా ఉంటాయని, తాను కూడా మద్దతుగా ఉంటానని హామీ ఇచ్చారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ కే.లక్ష్మీనారాయణ ధర్నా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని విధ్వంసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి 15శాతం కేటాయిస్తామని చెప్పిన బడ్జెట్‌ను 7.3 శాతానికి కుదించారని, దీన్ని బట్టి ప్రభుత్వ వైఖరి స్పష్టమవుతోందని అన్నారు. విద్యారంగానికి 15శాతం బడ్జెట్ కేటాయిస్తేనే ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని, ఆమేరకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని సూచించారు. టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగులు, ఉపాధ్యాయులను, ఆశ్రమ పాఠశాలల సీఆర్‌లను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రతతో కూడిన పేస్కేల్ ఇవ్వాలని, ప్రతి ఉద్యోగికి 10లక్షల ఆరోగ్యభీమా, జీవిత భీమా కల్పించాలని, ఉద్యోగ విరమణ సందర్భంగా 25లక్షల బెనిఫిట్స్ ఇవ్వాలని, ఉద్యోగులందరికీ రీ ఎంగేజ్ విధానాన్ని తీసివేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మద్దతు తెలుపగా, టీపీటీఎఫ్ నాయకులు పి.మహేందర్‌రెడ్డి, పి.నారాయణమ్మ, లక్ష్మయ్య యాదవ్, ఆత్రం భుజంగరావు, ఆర్.రమేష్, ఎస్.విజయ్, బోగ రమేష్, డి.రాజయ్య, టీపీటీఎఫ్ సీనియర్ నాయకులు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## తొక్కిసలాట ఘటనతో సంధ్య థియేటర్‌లో మరమ్మతులు

**-పాత సిసి కెమెరాల స్థానంలో అధునాతనమైన కెమెరాలు**
**-గేట్లకు బోర్డులు, మెటల్ డిటెక్టర్లు, ఫైర్ సేఫ్టీ ఏర్పాటు**



సంధ్యా థియేటర్(ఫైల్)

**హైదరాబాద్ డిసెంబరు 26 ప్రభాతవార్త:** ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని సంధ్యాథియేటర్ లోపల, వెలుపల మరమ్మత్తులు ప్రారంభమయ్యాయి. థియేటర్‌లో ఈ నెల 4న 'పుష్ప-2' ప్రీమియర్ షో-ది రూల్' ప్రీమియర్ షో సందర్భంగా తొక్కిసలాట జరిగి ఓ మహిళ మృతి చెందడం చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో థియేటర్ యాజమాన్యం ఈ చర్యలకు ఉపక్రమించింది. ఈ ఘటనలో రేవతి అనే మహిళ చనిపోగా, తీవ్ర గాయాలతో ఆమె తొమ్మిదేళ్ల కుమారుడు శ్రీతేజ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన నేపథ్యంలో సదరు థియేటర్ యజమానులు తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. థియేటర్ లోపల, బయట పూర్తిగా మరమ్మతులు చేయిస్తున్నారు. ఇప్పటికే ఆ పనులు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా థియేటర్ లోపల దృశ్యాలను స్పష్టంగా చిత్రీకరించేలా పాత సీసీ కెమెరాలను తొలగించి, వాటి స్థానంలో అధునాతనమైన కొత్త సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల తొక్కిసలాట జరిగిన సందర్భంగా విరిగిపోయిన గ్రిల్స్‌కు మరమ్మత్తులు చేస్తున్నారు. అలాగే రెండు థియేటర్ల (సంధ్య 70ఎంఎం, సంధ్య 35ఎంఎం) గేట్లకు బోర్డులు, కొత్త గ్రిల్స్, మెటల్ డిటెక్టర్లు, ఫైర్ సేఫ్టీ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. రెండు థియేటర్‌ల ప్రాంగణాలలోకి వెళ్లడానికి రెండు థియేటర్లకు వచ్చే ప్రేక్షకులకు ఇబ్బంది కలగకుండా యజమానులు ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులలో భాగంగా రెండు గేట్లకు ప్రత్యేక సూచికలు బిగిస్తున్నారు.

## తెలంగాణ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ షురూ

**-15 జిల్లాల నుంచి పోటీపడుతున్న 131మంది సెయిలర్లు**



హుస్సేన్‌సాగర్‌లో సెయిలింగ్ పోటీల దృశ్యం

**హైదరాబాద్, డిసెంబర్ 26, ప్రభాతవార్త:**
ఎనిమిదో ఎడిషన్ తెలంగాణ స్టేట్ సెయిలింగ్ చాంపియన్‌షిప్ గురువారం హైదరాబాద్ హుస్సేన్ సాగర్‌లో ఘనంగా ప్రారంభమైంది. రికార్డు స్థాయిలో 15 జిల్లాల నుంచి 131 మంది క్రీడాకారులు ఆరు విభాగాల్లో పోటీ పడుతున్నారు. తొలి రోజు ప్రతికూల వాతావరణంలోనూ హుస్సేన్ సాగర్ జలాల్లో సెయిలర్లు రంగు రంగుల బోట్లలో ప్రాక్టీస్ తో సందడి చేశారు. ఈ ఏడాది ఆతిథ్య రాష్ట్రంగా హర్యానాకు చెందిన ఆరుగురు సెయిలర్లు ఓపెన్ విభాగంలో పాల్గొంటున్నారు. బాలురలో హైదరాబాద్‌కు చెందిన గోవర్ధన్ పల్లార, రిజ్వాన్ మహ్మద్ టాప్ సీడ్‌లుగా నిలవగా, సబ్ జూనియర్ విభాగంలో రసూల్ పురాకు చెందిన అక్కచెల్లెల్లు దీక్షిత, లాహిరి కొమరవెల్లి స్వర్ణ పతక ఫేవరెట్లుగా బరిలో నిలిచారు. జాతీయ అగ్రశ్రేణి సెయిల్లరు అయిన గోవర్ధన్, దీక్షిత ఆసియా క్రీడలకు ముందు పెద్ద బోట్లలో జూనియర్ విభాగాల్లో ట్రయల్స్‌కు వెళ్లడానికి ముందు పోటీపడుతున్న చివరి సబ్‌జూనియర్ విభాగం టోర్నీ ఇదే కావడం గమనార్హం. జాతీయ సబ్ జూనియర్ విభాగంలో దీక్షిత, గోవర్ధన్ నెం.1, నెం.2 ర్యాంకర్లుగా ఉన్నారు.కాగా, మాన్య రెడ్డి, శ్రవణ్ కత్రావత్ జూనియర్ క్లాస్‌లో టాప్ సీడ్‌లుగా పోటీలో నిలనిచారు. 2025లో మలేషియా, సింగపూర్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు తెలంగాణ జట్టులో ఎవరు చేరాలనేది ఫలితాలు నిర్ణయిస్తాయి. తెలంగాణ సెయిలింగ్ సంఘం, యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నిర్వహిస్తున్న ఈ టోర్నీ దేశంలోనే అతిపెద్ద చాంపియన్‌షిప్‌లలో ఒకటి. ఇటీవలే తెలంగాణ సెయిలింగ్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సుహేమ్ షేక్ కృషితో గత 10 సంవత్సరాలలో 60 మందికి పైగా జాతీయ చాంపియన్లు, దాదాపు 275 పతకాలతో తెలంగాణ ముందంజలో అగ్రస్థానంలో ఉంది. ఈపోటీలు ఈ నెల 29వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయని ఈ అవార్డుల ప్రదానోత్సవానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, జాతీయ బాలల హక్కుల కమిషన్ మాజీ చైర్‌పర్సన్ డా.శాంత సిన్హా హాజరవుతావుతారని సుహేమ్ షేక్ తెలిపారు.

## బాచుపల్లిలో గన్‌తో యువకుల హల్చల్

**కొంపల్లి, డిసెంబర్ 26, ప్రభాతవార్త :**
హైదరాబాద్‌లో కొంతమంది యువకులు గన్‌తో రెచ్చిపోయారు. అర్ధరాత్రి గన్స్ చేతపట్టి రోడ్లపై వీరంగం సృష్టిస్తూ హల్చల్ చేసిన ఘటన బాచుపల్లి స్పోర్ట్స్ క్లబ్ వద్ద చోటు చేసుకుంది. వాహన దారులను, పాదాచారులను గన్‌తో బెదిరిస్తూ తుపాకీ గురిపెట్టి యువకులు వీరంగం సృష్టిస్తూ భయభ్రాంతులకు గురిచేసిన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా.. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందించినా సకాలంలో స్పందించలేదని వాపోయారు. మరోవైపు.. యువకుల వీరంగంపై కాలనీ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యా రు. గన్‌తో హల్‌చల్ చేసిన దృశ్యాలు సీసీ టీవీలో రికార్డు అయ్యాయి. ఈ ఘటన పోలీసు ఉన్నతాధికారులు దృష్టికి వెళ్లడంతో యువకులకు తుపాకీ ఎక్కడి నుంచి వచ్చింది, యువకులు ఎవరూ అనేదానిపై సస్పెన్స్ కొనసాగుతుంది. ఈ విషయం బయటకు పొక్కకుండా కొందరు నాయకులు మేనేజ్ చేస్తున్నారు. మరోవైపు.. ఘటన జరిగి రోజులు గడుస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. దీంతో పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. సీసీటీవీల్లో రికార్డయిన దృశ్యాలు బయటికి రావడంతో మరోసారి ఈ ఘటన తీవ్ర చర్చకు దారి తీసింది. రోజులు గడుస్తున్నప్పటికీ ఎలాంటి చర్య లు తీసుకోకపోవడంపై పోలీసులు కావాలనే చూసి చూడకుండా వ్యవహరి స్తున్నారని సామాన్యులు మండి పడుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో శాంతి భద్రతలపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## ఘనంగా వీర బాల్ దివస్

**-అమరులకు నివాళులర్పించిన ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ,తోకల శ్రీనివాస్ రెడ్డి**



**అత్తాపూర్ డిసెంబరు26,ప్రభాతవార్త :**
మతం ,మానవత్వాలను రక్షించేందుకు తమ ప్రాణాలను త్యాగం చేసిన సాహిబ్జాదా జోరావర్ సింగ్,సాహిబ్జాదా ఫతే సింగ్ సేవలు మరవలేనివని వారి ధైర్య,సాహసాలను,త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకువాలని చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.గురువారం అత్తాపూర్ నౌ నంబర్ గురుద్వార్‌లో వీర బాల దివాస్ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంచార్జీ తోకల శ్రీనివాస్ రెడ్డితో కలిసి చేవెళ్ల ఎంపి కోండా విశ్వేశ్వర్ రెడ్డి ఇస్లాం మతోన్మాదానికి బలైన అమరవీరులకు నివాళులర్పించారు.సిక్ మత పెద్దలతో కలిసి ప్రార్ధనలు చేసి వారి సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....1704వ సంవత్సరంలో మొగలు నవాబ్ అయిన వజీర్ ఖాన్ మతం మారాలంటూ ఇద్దరు షహజాదేలను చిత్రహింసలు పెట్టారని అయినా ధర్మాన్ని మార్చుకునేందుకు 9 ఏళ్ల జోరావర్ సింగ్, 7 ఏళ్ల ఫతేసింగ్ నిరాకరించారని వారి త్యాగాలకు గుర్తింపుగా బాబా జోరావర్ సింగ్, బాబా ఫతే సింగల్ సిక్కుల పదవ గురువు గురుగోవింద్ సింగ్ చిన్న కుమారులు(సాహెబ్‌జాదేలు). వీరి ధైర్య, సాహసాలను, త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఏటా డిసెంబర్ 26న వీర బాల్ దివస్‌ను ఘనంగా జరుపుకోవడం చాలా సంతోషమని యువత ఇస్లాం మతోన్మాదానికి బలైన అమరవీరులను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు.ధర్మం కోసం వారు చేసిన ప్రాణత్యాగం గుర్తుగా మనం ఈ బాల దివాస్ జరుపుకొని మన ఐక్యతను చాటాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి , కొమరయ్య ,అత్తాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ విజయ్,గురుజార్ కమిటీ సభ్యులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కమాండ్ కంట్రోల్ సెంటర్ ముందు వ్యక్తి హల్‌చల్

**"సినిమా పెద్దలు కాదు గద్దలు "అంటూ ప్లకార్డు ప్రదర్శన**




**హైదరాబాద్, డిసెంబరు 26,ప్రభాతవార్త:**
సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటన.. అల్లు అర్జున్ అరెస్టు నేపథ్యంలో బెనిఫిట్ షోల రద్దు, టికెట్ల ధరల పెంపు ఉండదన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రకటనతో దిగివచ్చిన సినీ ఇండస్ట్రీ పెద్దలు గురురవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ లో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. అదే సమయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ బయట కామన్ మ్యాన్ పేరుతో ఓ వ్యక్తి చేసిన హల్చల్ సైతం ఇప్పుడు చర్చనీయాంశమైంది. "సినిమా పెద్దలు కాదు గద్దలు " ప్లకార్డు ప్రదర్శించిన ఆ వ్యక్తి సినిమా షోలపై టికెట్ల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.ఈసందర్భంగా అతన్ని పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. సీఎంతో సినిమా పెద్దల భేటీ అంటున్నారని.. కేవలం డబ్బులున్న వారే పెద్దలా అని..వందల కోట్లకు పైగా సినిమాలు తీసే వారే సినీ పెద్దలా అంటూ ప్రశ్నించారు. ఒక సామాన్య ప్రేక్షకుడిగా నా ఆవేదన సీఎంతో చెప్పుకోవాలని ఆందోళన చేపట్టినట్లుగా తెలిపారు. సినిమా ఇండస్ట్రీ అంటే కార్మికులు, ప్రేక్షకులు కూడా అని సీఎం గుర్తించాలన్నారు. మాతో కూడా భేటీ కావాలని మా వాదన సమస్యలు కూడా వినాలని కోరాడు. భారీ బడ్జెట్ సినిమాలకు ధరలు పెంచేందుకు అభ్యంతరం లేదని అయితే మధ్యతరగతి, సామాన్య ప్రజల కోసం థియేటర్ 60శాతం టికెట్ల ధరలను పెంచవద్దని, అప్పర్ క్లాస్ టికెట్లను కూడా పరిమిత రోజులతో పెంచుకోవడంపై అభ్యంతరం లేదని అతను పేర్కొన్నారు.

## ఘనంగా సిపిఐ వార్షికోత్సవ వేడుకలు

**సికింద్రాబాద్, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** సీపీఐ సికింద్రాబాద్ నియోజకవర్గం సహాయ కార్యదర్శి ఎండీ ఉమర్‌ఖాన్ ఆధ్వర్యంలో సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీపీఐ పార్టీ జెండాను చిలకలగూడ చౌరస్తా వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ పార్టీ ఆవిర్భవించి నూరవ సంవత్సరం పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. లక్షలాధిమంది కార్మికులు, సంఘాలు పార్టీ నీడలో మనగలుగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు లతీఫుద్దిన్, తివారి, సంజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విదేశాల్లో తెలుగువారు సాంస్కృతిక పరిరక్షకులు

**-వంశీ ఇంటర్నేషనల్ (ఇండియా) అధినేత వంశీ రామరాజు**



శ్రీనివాస్ గూడూరుకు ప్రవాస భారతీయ వంశీ గ్లోబల్ అవార్డు ప్రదానం చేసిన దృశ్యం

**హైదరాబాద్ డిసెంబరు 26 ప్రభాతవార్త:**
వృత్తి రీత్యా విదేశాల్లో స్థిర పడినప్పటికీ అక్కడ తెలుగు భాషా సంస్కృతులను పరిరక్షణ లో ఇక్కడ వున్నవారికన్నా తెలుగు సంప్రదాయాలు కళలు పట్ల తమ అభిమానం చూపుతున్నారు అని వంశీ ఇంటర్నేషనల్ (ఇండియా) స్థాపకుడు వంశీ రామరాజు అన్నారు. గురువారం సాయంత్రం ఎన్ఆర్ఐ అమెరికా లో స్థిరపడిన ఎస్ పి బి మ్యూజిక్ ఇంటర్నేషనల్( యు ఎస్ ఏ) ఛైర్మెన్ శ్రీనివాస్ గూడూరు కు ప్రవాస భారతీయ వంశీ గ్లోబల్ అవార్డు ప్రదానోత్సవం సభ జరిగింది.వంశీ రామ రాజు అవార్డు బహుకరించి మాట్లాడారు. విఖ్యాత గాయకుడు బాల సుబ్రహ్మణ్యం పేరిట సంగీత సంస్థను స్థాపించి అయన పాడిన పాటలు అక్కడి వారికి ప్రచారం చేస్తున్న పాటల ప్రియుడు శ్రీనివాస్ అన్నారు. దేశం నుంచి తెలుగు వారు ఎవరు వెళ్లినా అయన సహాయ సహకారాలు అందించే సహృదయుడు అని వివరించారు. ఇక్కడి తెలుగు గాయకులను పిలిపించి అక్కడ ప్రదర్శనలు కు తోడ్పాటు ను అందించే మంచి మనిషి శ్రీనివాస్ అని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రముఖ నేపథ్య గాయకుడు పార్థసారథి, రామాచారితో పాటు గాయకులు వినోద్‌బాబు, వై ఎస్ రామకృష్ణ తదితరులు మధుర గీతాలు ఆలపించారు. శైలజ సుంకరపల్లి, మధుర వీణ, సుధామయి పాల్గొన్నారు

## తక్షణమే ఎస్సీ,ఎస్టీ,బిసి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డా.వి.ఎల్.రాజు

**సైఫాబాద్, డిసెంబరు 26 ప్రభాతవార్త:** వర్గీకరణ జరిగిన తరువాతే బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌లు వేస్తామని, అంతేకాకుండా ఏలాంటి నియామకాలకు కూడా నోటిఫికేషన్‌లు జారీ చేయబోమని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని మాల మహానాడు జాతీయ కమిటి తీవ్రంగా ఖండించింది.ఈ మేరకు కేంద్ర కమిటీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా.వి.ఎల్.రాజు మాట్లాడుతూ నోటిఫికేషన్ విడుదల విషయంలో సిఎం రాజ్యాంగ వ్యతిరేకమైన విధానాన్ని అవలంభిస్తున్నారని, తక్షణమే స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. గత 10 ఏళ్ళుగా 15 వేల ఎస్సీ, ఎస్టీ, బిసి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ కాకపోవడంతో లక్షలాది మంది నిరుద్యోగుల ఆనేక మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఆర్‌పిఎస్‌తో రేవంత్‌రెడ్డి కుమ్మక్కైయి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. నిరుద్యోగుల జీవితాలతో సిఎం చెలగాటమాడితే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని బొందపెడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాల మహానాడు జాతీయ గౌరవ అధ్యక్షుడు సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్, రాష్ట్ర అధ్యక్షుడు జె.ఎన్.రావు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



ఐక్యత చాటుతున్న మైనార్టి నాయకులు.

**సైఫాబాద్, డిసెంబరు 26 ప్రభాతవార్త:** గడిచిన ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మైనార్టిలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎస్ఎస్ఎస్‌లో ఆలఇండియా ముస్లిం మైనార్టి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంఎ సిద్దిఖితో కలిసి ఆయన మాట్లాడారు. 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న హైవేల వెంబడి 100 ఎకరాల వక్ఫ్ భూమిని స్మశాన వాటికిలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిరుపేద ముస్లింలకు 100 చోప్పున వక్ఫ్ బోర్డు భూమిని పంపిణీ చేయాలని, వక్ఫ్ బోర్డు అక్రమించుకున్న కబ్జాదారులపై చర్యలు తీసుకుని భూములను స్వాదీనం చేసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ చేసిన మైనార్టి డిక్లరేషన్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ నాయకులు సనాఉల్లాఖాన్, జాంగీర్, మునీర్, ఇనాయక్‌ఆలీబాక్రి తదితరులు పాల్గొన్నారు.

## సాయినామస్మరణతో మారుమోగిన సాయిబాబా ఆలయం



సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు.

**బేగంపేట డిశంబరు 26,ప్రభాతవార్త**
సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్డు శ్రీసాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు సాయినామ స్మరణతో మారుమోగింది.ఈ ఆలయంలో ఈ నెల 19నుంచి (గత వారం రోజులుగా) 24 గంటల పాటు ఉదయం గం 9ల నుంచి 26 ఉదయం గం 9ల వరకు సాయి నామ స్మరణ భజన ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి అనే నామస్మరణ ఎనిమిది రోజుల పాటు కొనసాగింది.ఈ భజన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే వారం రోజులపాటు మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కార్య నిర్వహకులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక సాంకేతికరంగాలు విభిన్నకోణాలు కాదు : డా.వరప్రసాదరెడ్డి

**నాంపల్లి, డిసెంబరు 26 ప్రభాతవార్త :**
ఆధ్యాత్మిక, సాంకేతిక రంగాలు విభిన్న కోణాలకు సంబంధించినవి కాదని, ఒకదానికొకటి కొనసాగింపు మాత్రమేనని శాంతా బయోటెక్నిక్స్ అధినేత, పద్మభూషణ్ పురస్కార గ్రహీత డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి అన్నారు. అనుమానమున్నచోటుకు శాస్త్రవేత్త వస్తే, నమ్మకమున్న చోటుకు ఆధ్యాత్మికవేత్త వస్తాడన్న ఆయన మానవతావాదంతో నిండిన విజ్ఞాన పరిశోధనలు సమాజానికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. రావు పంగనామముల (పి.వి.ఎల్.ఎన్.రావు) ఫౌండేషన్, నాచ్యురల్ రిసోర్సెస్ డెవపల్‌మెంట్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి విశిష్ట అతిథులు డా. ఓలేటి పార్వతీశం, డా. అక్కిరాజు సుందర రామకృష్ణ, మాశర్మ, రాధాకృష్ణ తదితరులతో కలిసి ప్రఖ్యాత భూశాస్త్రవేత్త చాగంటి విజయకుమార్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, పండితుడు బ్రహ్మశ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తిలను ఘనంగా సత్కరించి రావు పంగనామముల జీవిత సాఫల్య పురస్కారాలను ప్రదానంచేసి శుభాకాంక్షలు తెలిపారు.



శ్రీమన్నారాయణమూర్తికి జీవితసాఫల్య పురస్కారమందిస్తున్న వరప్రసాదరెడ్డి, ఓలేటి, రాధాకృష్ణ తదితర అతిథులు

ఎంతోకాలంగా భూగర్భ జలాల పరిరక్షణ, నీటిబావువుల డ్రిల్లింగ్, ప్రకృతి వనరుల పరిశోధనల్లో కీలకపాత్ర పోషించినందుకుగాను చాగంటి విజయకుమార్; ఆధ్యాత్మికరంగంలో అద్భుత ప్రవచనాలు, రామాయణం, భగవద్గీతలను ప్రబోధిస్తున్నందుకు బ్రహ్మశ్రీ శ్రీమన్నారాయణమూర్తిలు పి.వి.ఎల్.ఎన్.రావు జీవన సాఫల్య పురస్కారాలు అందుకోవడం విశేషం. అనంతరం పార్వతీశం, సుందరరామకృష్ణ తదితరులు ప్రసంగించారు.

## తోలుబొమ్మలాట మోతె జగన్నాథం మృతికి వేదకుమార్ సంతాపం

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త**
జనగామ జిల్లా అమ్మాపురం మోతె జగన్నాథం ఆకస్మిక మృతి పట్ల తెలంగాణ దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.' బొమ్మలోల్లు' అని ఆప్యాయంగా పిలుచుకునే మోతె జగన్నాథం, చెక్క తీగల తోలుబొమ్మలాట ద్వారా శతాబ్దాల నాటి కథా సంప్రదాయాన్ని పరిరక్షించడానికి అంకితమైన కళాకారుల బృందానికి నాయకత్వం వహించాడు. వీరి ప్రదర్శనలు రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలకు, ప్రహ్లాద, రామదాసు కథలకు ప్రాణం పోశాయి. ఈ బృందం యొక్క కళానైపుణ్యం తెలంగాణ ప్రాంతపు గొప్ప సాంస్కృతిక వారసత్వానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ప్రస్తుతం తెలంగాణలోని వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఒకే మోతె కుటుంబానికి చెందిన రెండు బృందాలు మాత్రమే మిగిలాయి.జగన్నాథంతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ వేదకుమార్ మణికొండ 2006లో ఢిల్లీలోని నేషనల్ మాన్యుస్క్రిప్ట్ మిషన్‌తో జగన్నాథం బృందం తో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. వీరంతా కలిసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 11 జిల్లాల్లో పర్యటించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు సిఫార్సులతో సహా వేదకుమార్ నిరంతర ప్రయత్నాల ద్వారా, జగన్నాథం,అతని బృందం దేశంలోని 12కి పైగా రాష్ట్రాలలో ప్రదర్శనలు ఇస్తూ జాతీయ వేదికలపై గుర్తింపు పొందారు. తెలంగాణ దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ మణికొండ మాట్లాడుతూ తెలంగాణ



రాష్ట్ర ప్రభుత్వం ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని, తెలంగాణ రాష్ట్రానికి ఆయన చేసిన సంప్రదాయ సాంస్కృతిక రూపాన్ని గుర్తించాలని, అంతరించిపోతున్న ఈ సంప్రదాయాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ,ఈ కళను సజీవంగా ఉంచడంలో మిగిలిన కీలుబొమ్మల కుటుంబ కళాకారులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.అంతరించిపోతున్న కళారూపాన్ని తిరిగి పూర్వ వైభవం తీసుకురావడానికి తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తున్నాను అని తెలిపారు.జగన్నాథంకు పద్మశ్రీ దక్కేలా ప్రయత్నం జరుగుతున్న సంధర్భంలో ఆయన ఆకస్మిక మృతి తీవ్రంగా కలిచి వేసిందన్నారు.కళారంగానికి ఆయన మృతి వల్ల ఏర్పడిన నష్టం పట్ల వేదకుమార్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.మోతె జగన్నాథం కుటుంబానికి వేదకుమార్ మణికొండ ప్రగాఢ సానుభూతి తెలిపారు. గొప్ప కళాకారుడి మృతికి సంతాపం తెలిపారు.

## శాంతినగర్‌లో ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



అయ్యప్ప స్వామి పడిపూజలో ప్రత్యేక పూజలు చేస్తున్న స్వాములు

**తార్నాక, డిసెంబర్ 26 ప్రభాతవార్త:**
శాంతినగర్‌లో గురుస్వామి ఈశ్వర్ ఆధ్వర్యంలో 23వ అయ్యప్ప పడి పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు అయ్యప్ప స్వామికి పాలు, పెరుగు, తేనె వంటి 18 రకాలైన పదార్థాలతో అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, హారతి వంటి పూజా కార్యక్రమాలను భక్తితో ఆచరించారు. శ్రీసాయి భజన మండలి విజ్జు స్వావి ఆధ్వర్యంలో అయ్యప్ప గీతాలు, భజనలతో మాలధారులు భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. స్వామియే శరణం అయ్యప్ప అనే నామ స్మరణ తో శాంతినగర్ ప్రాంతమంతా ఆధ్మాతిక వాతావరణం సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో గురు స్వాములు రమేష్ గురుస్వామి, మల్లికార్జున్,బబ్లు,సాయి, ప్రమోద్ గురుస్వామి, రవి గురుస్వామి,నరసింహ్మా, రాజు, నాగేంద్రబాబు, శ్రీను, నరేందర్ మహేష్‌తో పాటు వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తన వంతు సహకారాన్ని అందిస్తా : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 26, ప్రభాతవార్త**
కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తన వంతు సహకారాన్ని అందిస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కమిటీ సభ్యులకు హామి ఇచ్చారు. గురువారం ఫతేనగర్ డివిజన్ గౌతమ్ నగర్‌లో అల్ అన్సారి సొసైటీ ఆధ్వర్యంలో 210 గజాలలో వారి సొంత స్థలంలో నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ పేద ప్రజల పెళ్లిళ్ల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించడం నిజంగా హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జహీర్ సలఉద్దీన్, అధ్యక్షులు ఎండి గౌస్, ఉపాధ్యక్షులు ఎండి యూసుఫ్, ఎండి ఖలీల్ గోరేమియా, ఎండి నిస్సార్, అహ్మద్ ఎండి ముజీబ్ ఎండి అక్రం తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి హయాంలోనే నగరాభివృద్ధి

**-టిడిపి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు సాయిబాబా**



సభ్యత్వనమోదులో మాట్లాడుతున్న అధ్యక్షులు సాయిబాబా,చిత్రంలో ఖాత విజయ్‌కుమార్ తధితరులు

**తార్నాక, డిసెంబర్ 26 ప్రభాతవార్త :**
టిడిపి హాయాంలోనే నగరాభివృద్ధి జరిగిందని టిడిపి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు సాయిబాబా పేర్కొన్నారు. శాంతినగర్ బస్ స్టాప్ లో అడ్డగుట్ట డివిజన్ టీడీపీ అధ్యక్షులు ఖాతా విజయ్ కుమార్ , కాంటెస్టెడ్ కార్పొరేటర్ లక్ష్మి ప్రసన్న ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సికింద్రాబాద్ నియోజకవర్గ పార్లమెంటరీ అధ్యక్షులు సాయిబాబా, చిట్టి వీరయ్య నాగ మల్లేశ్వరి మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి మంచిస్పందన ఉందన్నారు. స్వచ్ఛందంగా జనం సభ్యత్వనమోదు చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. సభ్యత్వ నమోదుకు ఉచిత భీమా సదుపాయాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట్ నియోజకవర్గా నికి చెందిన సత్యనారాయణ, భాను ప్రకాష్, సికింద్రాబాద్ నియోజకవర్గం నాయకులు ప్రసాద్ రావు, విక్రమ్, జగదీష్ గౌడ్, వెంకటస్వామి, ప్రసాద్, పందిరి నరసింహ, రాజు, మహిళ నాయకులు కనుక బాయీ కీర్తి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శతాబ్ది ఉత్సవాల ప్రారంభం



అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రేమ్‌పావని

**సైఫాబాద్, డిసెంబరు 26 ప్రభాతవార్త:** సిపిఐ శతాబ్ది ఉత్సవాలు సందర్భంగా గురువారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ ఎదుట సీనియర్ నాయకురాలు పి.ప్రమ్‌పావని అరుణ పతాకాన్ని ఎగరవేశారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు తెలంగాణ ప్రజా నాట్యమండలి కళాకారులు కమ్యూనిస్టు పార్గీకి చేసిన త్యాగాలను, విజయాలను వివరిస్తూ పాడిన పాటలను ప్రజలను అకట్టుకున్నాయి. సిపిఐకి అలాగే నారాయణగూడలోని రోడ్డుపైన ఏర్పాటు చేసిన జెండాలు, స్టేజి అలంకరణ ప్రజలను అకర్షించాయి. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహ్మా మాట్లాడుతూ సిపిఐ బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా ఆనేక మిలిటెంట్ పోరాటాలను నిర్వహించిందని వివరించారు.పార్టీ నాయకులపై అక్రమంగా కేసులు పెట్టి అన్యాయంగా జైల్లో పెట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శతాబ్ది ఉత్సవాలను ఏడాది పాటు నిర్వహించి, తిరిగి ప్రజల్లో గత పూర్వవైభవాన్ని తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎస్.బాల్‌రాజ్, ఎన్.జ్యోతి, ఛాయాదేవి, స్టాలిన్, కమతం యాదగిరి, పల్లె నర్సింహ్మా, ఉప్పలయ్య, పడాలి నళిని, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## బేతనీయ చర్చిలలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**కంటోన్మెంట్, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని సంజీవయ్యనగర్ వీకర్ సెక్షన్‌లోని బేతనీయ చర్చిలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ జోనాథన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన కార్యక్రమాలతో చర్చి సందడిగా మారింది. క్రిస్మస్ సందర్భంగా ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ కార్యక్రమంలో చర్చి ప్రతినిధులు గణపతి, కే.దాస్, ప్రసాద్, ప్రేమ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.



బేతనీయ చర్చిలో క్రిస్మస్ వేడుకలు

## నార్సింగిలో పార్కు పనులను పరిశీలించిన కౌన్సిలర్ లక్ష్మీ ప్రవళిక కిరణ్

**- రూ.కోటిన్నరతో నిర్మిస్తున్న పార్కు పనులు పరిశీలించిన కౌన్సిలర్**

**నార్సింగి, డిసెంబర్ 26 ప్రభాతవార్త :**
నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని అరుణోదయ కాలనీలో రూ.కోటి 50.లక్షలతో అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్న పార్కు పనులను గురువారం స్థానిక కౌన్సిలర్ లక్ష్మీ ప్రవళిక కిరణ్ పరిశీలించారు. పార్కులో చూడగానే మనస్సులకు హత్తుకునే రంగు రంగుల పూల మొక్కలు, పచ్చిక బయళ్లు, ఆట వస్తువులు, పూల కుండీలు, వాకింగ్ ట్రాక్స్, విశ్రాంతి భవనం, చిన్న పిల్లలు ఆడుకునే ఆట వస్తువులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మీ ప్రవళిక కిరణ్ మాట్లాడుతూ కాంక్రీట్ జంగల్‌గా మారిపోయిన నార్సింగిలో ప్రజలకు కాసింత మనశ్శాంతిని ఇచ్చేందుకు రూ.కోటిన్నర డబ్బులను వెచ్చించి అద్భుతమైన పార్కును నిర్మిస్తున్నామన్నారు. ఈ పార్కు మరో పది రోజులలో ప్రజలకు అందుబాటులోకి వస్తుందని, అన్ని పనులు పూర్తవుతున్నాయని, తుది మెరుగులు దిద్దుకుంటుందని వివరించారు. స్థానిక ప్రజలకు వాకింగ్, యోగ, ఆసనాలు, ప్రాణాయామం చేసుకునేందుకు, విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయించామని, చిన్న పిల్లలు ఆడుకునేందుకు అధునాతనమైన ఆట వస్తువులు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ పార్కుకు వచ్చే ప్రతీ ఒక్కరూ ఇక్కడ లభించే



నార్సింగి మున్సిపల్ అరుణోదయ కాలనీ పార్కులో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ లక్ష్మీ ప్రవళిక కిరణ్.

అహ్లాదకరమైన వాతావరణంతో తమ అలసటను తీర్చుకొని మనశ్శాంతిని పొందుతారని, ఆరోగ్యాన్ని పెంచుకుంటారని ఆశిస్తున్నామని కౌన్సిలర్ లక్ష్మీ ప్రవళిక కిరణ్ అభిప్రాయ పడ్డారు. ఈ పార్కు నిర్మాణం నాకు వ్యక్తిగతంగా చాలా సంతోషాన్ని కలిగిస్తుందని ఆమె వివరించారు. కౌన్సిలర్ వెంట మాజీ వార్డు సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వినోద్ కుమార్, కిరణ్ తదితరులు ఉన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ హాస్టళ్లను మూసి వేయాలి

**హైదరాబాద్ డిసెంబరు 26 ప్రభాతవార్త:**
ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డివైఎఫ్ఐ నగర కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఆర్ టీ సి క్రాస్ రోడ్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తూన్న మహాలక్ష్మి బాలికల గర్ల్స్ హాస్టల్ ను మూసి వేయాలని,విద్యార్థినిలతో అసభ్యకరంగా ప్రవర్తించిన వార్డెన్ పై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని హాస్టల్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మి, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అశోక్ రెడ్డి, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి జావీద్ మాట్లాడుతూ నిబంధనలు విరుద్ధంగా హాస్టళ్ళను నడిపిస్తూ ఇరుకైనా గదులలో వసతి కల్పిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అదే విధంగా మహాలక్ష్మి హాస్టల్ లో శ్యామ్ బాబు అనే వార్డెన్ విద్యార్థునిలతో అనుచితంగా ప్రవర్తిస్తూ ఫీజుల పేరుతో వేధిస్తున్నారని, . ఇదేంటని ప్రశ్నిస్తే దౌర్జన్యాలకి పాల్పడుతున్నారని అన్నారు. విద్యార్థినిల తరపున అడగడానికి వెళ్తే కర్రలతో దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తూ దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇటీవలి కాలంలో ప్రైవేట్ హాస్టల్స్‌లో ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని,పుట్టగొడుగుల్లాగా పుట్టుకొస్తున్న హాస్టల్స్ పై ప్రభుత్వం నిరంతర నిఘా పెట్టి కనీస నిబంధ నలు పాటించని హాస్టల్స్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ ఫ్ఐ నగర అధ్యక్షులు లెనిన్ నాయకులు ప్రశాంత్,శ్రీమాన్, చరణశ్రీ, విగ్నేష్, రాజేష్,ఐ ద్వ నాయకులు పద్మ,ప్రజ సంఘాల నాయకులు కుమార్, నరేష్,మరన్నా,విద్యార్థులు పావని,జయలక్ష్మి, పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డివైఎఫ్ఐ నగర కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన దృశ్యం

## కాళోజీ నారాయణరావుకి పి.వి.నరసింహారావు స్మారక అవార్డు పదానం

**సైఫాబాద్, డిసెంబరు 26 ప్రభాతవార్త:** భారతరత్న, మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు స్మారక అవార్డును ప్రజా కవి, పద్మ విభూషణ్ కళోజీ నారాయణరావుకు పి.వి.నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ ప్రకటించింది. ఈ నెల 28వ తేదీ సాయంత్రం రవీంద్రభారతిలో జరిగే పురస్కార సభలో కాళోజీ కుమారుడుకు అవార్డును అందజేయనున్నట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ సాంకేతిక నిపుణులు పద్మశ్రీ డా.టి.హనుమాన్‌చౌదరి, ఆర్టిఐ మాజీ కమిషనర్ పి.విజయ్‌బాబు, విశ్రాంత ఐఎఎస్ అధికారి మల్లవరపు బాలలత, గాంధీభవన్ ట్రస్ట్ ఛైర్మన్ సూర్యానాయక్, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మాదంశెట్టి అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఈ సభలో ముఖ్యఅతిధిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, గౌరవ అతిథులుగా రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేష్ కుమార్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న పద్మశ్రీ హనుమాన్‌చౌదరి

గడ్డం వివేక్ వెంకటస్వామి, మాజీ ఎంపి కెవిపి రామచంద్రరావు, పి.వి.తనయుడు పి.వి.ప్రభాకర్‌రావు, ఎమ్మెల్సీలు అమీర్‌ఆలీఖాన్, సురభివాణిదేవి, తెలంగాణ సాంస్కృతిక సారధి ఛైర్మన్ డా.వెన్నల గద్దర్ తదితరులు పాల్గొంటారని వివరించారు. ఈ సమావేశంలో హైకోర్టు న్యాయవాది నూతి శ్రీకర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. సభలో పి.వి.నరసింహారావు, కళోజీ నారాయణరావు అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## మూడుతరాల గురుశిష్యపరంపర కళానృత్యనికేతన్ : డా. మామిడి హరికృష్ణ

**రవీంద్రభారతి, డిసెంబరు 26 ప్రభాతవార్త :**
ప్రఖ్యాత నాట్యగురువు డా. బిందు అభినయ్ 2007లో కళానృత్యనికేతన్ స్కూల్ ఆఫ్ కూచిపూడి అకాడమీని స్థాపించి వందలాదిమంది శిష్యులను అద్భుత కళాకారులుగా తీర్చిదిద్ది నేడు సంస్థ 16వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా మూడుతరాల గురుశిష్య పరంపరగా 146మంది విద్యార్థుల కూచిపూడి నృత్యవిన్యాసాలు నేత్రపర్వంగా సాగడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ సంస్థ, గురు శిష్యులను ఎంతగానో అభినందించి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రవీంద్రభారతి ప్రధాన మందిరంలో జరిగిన ఈ వేడుకలను జ్యోతిప్రకాసనంచేసి ప్రారంభించిన హరికృష్ణ కళానృత్యనికేతన్ నగరమంతటా వివిధశాఖలుగా విస్తరించి కళాకారులను ప్రోత్సహించడం హర్షదాయకమన్నారు. నాట్యగురువు, సంస్థ అధ్యక్షురాలు డా. బిందు అభినయ్ సంస్థ ఆధ్వర్యంలో వందలాదిమంది విద్యార్థులు కూచిపూడి నృత్యశిక్షణ



మూడుతరాల గురుశిష్యపరంపర నృత్యప్రదర్శనల్లో దృశ్యం

ఇచ్చామని, వందేభారత్ జాతీయ నృత్యపోటీల్లో ప్రతిభ కనబరచడమేకాక ఢిల్లీ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా భారత రాష్ట్రపతి, ప్రధానమంత్రి సమక్షంలో కూచిపూడి నృత్యానికి ప్రాతినిధ్యం వహించే ప్రతిష్టాత్మక అవకాశం పొందామన్నారు. నేటి వార్షికోత్సవ వేడుకల్లో వివిధ అంశాలతో అకాడమీ బృందంచే ప్రదర్శింపబడిన కూచిపూడి నృత్య ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది.

## డిసిఎం డ్రైవర్ల పార్కింగ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తా

**: ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌తో అసోసియేషన్ సభ్యులు

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 26, ప్రభాతవార్త**
పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బి.ఎం.ఎస్ గాంధీనగర్, కొంపల్లి డీసీఎం పార్కింగ్ స్టాండ్స్ అసోసియేషన్ సభ్యులు, సంక్షేమ ప్రదాత ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని కలిసి గాంధీ నగర్‌లో డీసీఎంల పార్కింగ్ కోసం స్థలం కేటాయింపుతో పాటు కొంపల్లి పార్కింగ్ చేసి ఉన్న డీసీఎంలకు ట్రాఫిక్ పోలీసులు ఫోటోలు తీసి చలాన్ లు పంపిస్తున్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ డీసీఎం డ్రైవర్ల, సమస్యలు తనకు తెలుసని జీడిమెట్లలోని ట్రాక్ పార్కింగ్ సమస్య పరిష్కారంలో భాగంగా బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ స్థలాన్ని కేటాయింపచేసి శాశ్వత పరిష్కారం చూపామని, అదేవిధంగా త్వరలోనే గాంధీ నగర్, కొంపల్లి డీసీఎం పార్కింగ్ సమస్యలను కూడా పరిష్కరిస్తామని అన్నారు. ఈ సందర్భంగా కొంపల్లిలో డీసీఎం పార్కింగ్ సమస్యకు శాశ్వతంగా పరిష్కరించడంలో భాగంగా కొంపల్లి ఫ్లైఓవర్ వద్ద వాహనదారులకు ఇబ్బంది కలగకుండా పార్కింగ్ కోసం అనువైన స్థలాన్ని పరిశీలించాలని ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బి.ఎం.ఎస్ రాష్ట్ర అధ్యక్షులు వారాల సమ్మయ్య యాదవ్, కొంపల్లి అసోసియేషన్ అధ్యక్షులు మల్లికార్జున్, పలువురు డీసీఎం ఓనర్లు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 25న ఎస్ఎస్‌సి బోర్డు పరీక్షలు

**చార్మినార్,డిసెంబరు 26 ప్రభాతవార్త :**
పవిత్ర రమజాన్ మాసంలో పదివ తరగతి పరీక్షలు జరుగుతున్నందున మైనార్టీ విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండ ఎస్ఎస్‌సి బోర్డు పరీక్షల తేదీలను మార్చి నెల 25వ తేదీ కంటే ముందు లేదా ఏప్రిల్ మూడవ తేదీ తర్వాత నిర్వహించాలని అఖిల భారత కమ్యూనిటీ పాఠశాలల అసోసియేషన్ ఛైర్మన్ డాక్టర్ మహ్మద్ అన్వర్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కోరారు. పదివ తరగతి పరీక్షలు వచ్చే సంవత్సరం మార్చి నెల 21వ తేదీ నుంచి ఏప్రిల్ నెల 4వ తేదీ వరకు జరగనున్నాన్నాయని,రాష్ట్రంలో వేలాది మంది మైనార్టీ విద్యార్దులు పదివ తరగతి పరీక్షలకు హాజరు కానున్నారని ఆయన తెలిపారు.రమజాన్ మాసం ముస్లింలకు ఉపవాసం మరియు ఆధ్యాత్మిక ఆచరణ కోసం అత్యంత పవిత్రమైన మాసమని,ఈ సమయంలో విద్యార్దులకు పరీక్షలు ఉండటంతో ఒత్తిడి,ఇబ్బందులు ఉంటాయని,రంజాన్ మాసం చివరి పది రోజులు అత్యంత పవిత్రమైనవని,ఇందులో లైలతుల్ ఖదర్ (శక్తిరాత్రి),జుమాతుల్ విదా,తాఖ్ రాత్రులు రంజాన్ మాసం చివరి వారంలో రానున్నాయని ఆయన తెలియజేశారు. రమజాన్ మాసంలో విద్యార్దులు రాత్రింతా ప్రత్యేక ప్రార్దనలు చేస్తారని, రమజాన్ మాసం ముస్లింలకు ఎంతో ప్రాముఖ్యతమైందని ఆయన తెలిపారు.ప్రభుత్వం ఎస్ఎస్‌సి పరీక్షలు మార్చి నెల 25వ తేదీకి ముందు లేదా రమజాన్ పండుగ తరువాత ఏప్రిల్ నెల 3వ తేదీ తరువాత నిర్వహించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



జాతీయ చేపల అభివృద్ధి సమావేశానికి హాజరైన కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బాఘేల్‌ని రాజేంద్రనగర్ అసెంబ్లీ బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి , పార్లమెంటరీ కన్వీనర్ ఎన్.మల్లారెడ్డి,అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్,జయకుమార్ యాదవ్,జగన్ తదితరులు ఉన్నారు.

## పోరాటాల ఎర్ర జెండాకు వంద సంవత్సరాలు పూర్తి




**తుర్కయంజాల్ డిసెంబర్ 26,ప్రభాతవార్త :** సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు శివకుమార్ ఆధ్వర్యంలో గురువారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సిపిఐ జెండా ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఒరుగంటి యాదయ్య హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఒరుగంటి యాదయ్య మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటం లో బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడటంతో పాటు, దోపిడీ కి వ్యతిరేకంగా దేశ ప్రజలను ఐక్యం చేయడంలో కమ్యూనిస్ట్ పార్టీ కీలక భూమిక పోషించిందని అన్నారు. తెలంగాణా సాయుధ పోరాటాన్ని నిర్వహించడంతో పాటు దేశంలో అనేక కార్మిక, కర్షక పోరాటాలను నిర్వహించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కె. శ్రీను, పల్లపు శివకుమార్, శ్రీకాంత్, వట్టి విజయ, సుందరమ్మ, భాస్కర్, రాములు, నాగేశ్వర్,(ఏ ఐ ఎస్ ఎఫ్) నాయకులు గండికోట శివ, వివేక్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు గిట్టుబాటు ధర అందించడానికి కృషి : డైరెక్టర్ మాదారం కృష్ణ


డైరెక్టర్ మాదారం కృష్ణని సన్మానిస్తున్న వ్యాపారస్తులు, సిబ్బంది

**మలక్ పేట ,డిసెంబర్ 26, ప్రభాతవార్త :** రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారికి అందించడానికి కృషి చేస్తామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదారం కృష్ణ పేర్కొన్నారు. నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేసిన మాదారం కృష్ణనూ మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లలో జరిగిన కార్యక్రమంలో పలువురు వ్యాపారస్తులు, సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను తెలుసుకుని వారి సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. అదే విధంగా వ్యాపారస్తుల సమస్యలను పరిష్కరించి వారికి తమ వంతు తోడ్పాటుఊ అందిస్తామని పేర్కొన్నారు. నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధునికరించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పాలి : డైరెక్టర్ మహమ్మద్ షకీల్


ప్లకార్డులు ధరించి ఆందోళన నిర్వహిస్తున్న డైరెక్టర్లు మాహమ్మద్ షకీల్, కిషన్ సింగ్ తదితరులు

**మలక్ పేట ,డిసెంబర్ 26, ప్రభాతవార్త:**
కేంద్రమంత్రి అమీత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మహమ్మద్ షకిల్, కిషన్ సింగ్ లు డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి అమీత్ షా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు సమీర్ వలి ఉల్ల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి మలక్ పేట నియోజకవర్గం నుంచి డైరెక్టర్లు మహమ్మద్ షకిల్ , కిషన్ సింగ్, డివిజన్ అధ్యక్షులు చక్రపాణి, మహేష్ కుమార్ తదితరులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రమంత్రి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాహుల్ సింగ్, షాహిద్ ఖాన్, విగ్నేష్ ,సంతు తదితరులు పాల్గొన్నారు .

### దిల్‌షుక్ నగర్ బాప్టిస్ట్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు


బాప్టిస్ట్ చర్చిలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న దృశ్యం

**మలక్ పేట ,డిసెంబర్ 26, ప్రభాతవార్త:** దిల్ షుక్ నగర్ బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చి అధ్యక్షులు లూకానంద రావు, ప్రధాన కార్యదర్శి వినోద్ బచ్చు, కోశాధికారి ఇందర్ జి,ఎడిఫస్ చైర్మన్ ప్రసాద్, పాస్టర్లు బోద సాల్మన్, శాంత కుమార్ ల ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అదేవిధంగా పలు భక్తి గీతాలను ఆలపించడంతో పాటు వివిధ సాంస్కృతి కార్యక్రమాలను ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యేసు క్రీస్తు బోధనలు ప్రజలకు మార్గదర్శకమని తెలిపారు. ఏసుక్రీస్తు బోధనలు మంచి నడవడిక గురించి తెలియజేస్తాయని తెలిపారు. ప్రేమ, కరుణ, శాంతి ద్వారా ప్రజల జీవితంలో సుఖ, సంతోషాలను నింపిన ఏసు క్రీస్తు జీవితం సదా అనుసరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ రమణ కాలనీ నూతన కమిటీ



**వనస్థలిపురం. డిసెంబరు. 26. ప్రభాతవార్త.**
శ్రీరమణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు సూదిని వెంకటేశ్వర రెడ్డి,ప్రధాన కార్యదర్శి ఎం .కాంత రెడ్డి, సందడి మురళీధర్ రెడ్డి,గౌరధ్యక్షులు దశరతరామిరెడ్డి,మల్లికార్జున్ ,వైస్ ప్రెసిడెంట్ కొండల్,మహిపాల్ రెడ్డి,ఆర్గనైజింగ్ సెక్రటరీ లింగయ్య, శ్రీశైలం గౌడ్,జాయింట్ సెక్రటరీ మల్లేష్ ,కనకా చారి అడ్వైసర్ రవీందర్ నాయక్, లి.శ్రీకాంత్ రెడ్డి,లు ఇతర కాలనీ సభ్యులు,టెంపుల్ కమిటీ సభ్యులు శ్రీధర్ రెడ్డి,రవీందర్, రవిచంద్ర,ప్రవీణ్,అరుణ్ రాజ, యాదయ్య పాల్గొన్నారు.

## ఆర్టీసీ హమాలీలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### -ఆర్టీసీ హమాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారుతి


యూనియన్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఐక్యతను చాటుతున్న అధ్యక్షుడు మారుతి తదితరులు

**మలక్ పేట ,డిసెంబర్ 26, ప్రభాతవార్త:**
ఆర్టీసీ హమాలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆర్టీసీ హమాలీల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు మారుతి డిమాండ్ చేశారు. తెలంగాణ ఆర్టీసీ బస్ డిపోలలో పనిచేస్తున్న మాలి కూలీల సంఘం ఆధ్వర్యంలో నగరంలో రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ ఆర్టీసీ హమాలీ కార్మికులు పలు ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఆర్టీసీ హమాలీ కార్మికులను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కొన్నిచోట్ల నూతన ఏజెన్సీల కారణంగా ఆర్టీసీ హమాలీ కార్మికులు ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి తలెత్తుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్టీసీ హమాలీల సమస్యలను పరిష్కరించాలని, హమాలీ రేట్లు పెంచాలని విజ్ఞప్తి చేశారు . ఆర్టీసీ హమాలి కార్మికులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమాన్ని కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, జన్ను భాస్కర్, సత్యనారాయణ, నరేష్ ,వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వివేక్‌నగర్‌లో నత్తనడకన సాగుతున్న డ్రైనేజీ పనులు..!

### -పట్టించుకోని అధికారులు - స్థానికుల అవస్థలు


రామంతాపూర్ వివేక్‌నగర్‌లో నాలాపై ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్న స్థానికులు


వివేక్‌నగర్‌లో రోడ్డు దాటేందుకు తాత్కాలికంగా వేసిన కట్టెలు దృశ్యం.

**ఉప్పల్, డిసెంబరు 26 ప్రభాతవార్త :** రామంతాపూర్ వివేక్‌నగర్‌లో రూ.కోటి వ్యయంతో రెండు నెలల క్రితం చేపట్టిన వరద నీటి కాలువ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గతంలో ఉన్న పురాతన నాలాను తొలగించి కొత్తగా వరద నీటి కాలువ పనులు చేపట్టారు. పనులను స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా రెండు నెలల క్రితం ప్రారంభించి రోడ్డు మధ్యలో గుంతలు తవ్వారు. పాత డ్రైన్‌లు తవ్వి తిరిగి కొత్త డ్రైన్ నిర్మాణం చేపట్టారు.అయితే అధికారుల పట్టింపులేమితనం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పనులు చేయకుండా గుంతలు తవ్వి వదిలివేయడంతో రోడ్డంతా బురదమయంగా మారిపోయింది. దీనిపై పలుమార్లు అధికారులను కలిసి ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. పనుల ప్రారంభంలోనే కాంట్రాక్టర్ల వద్ద నుంచి కమీషన్ల రూపంలో డబ్బులు దండుకుంటున్నారని, పనులు చేయకున్నా వారిని ఏమి చేయడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. అధికారులు తూతూమంత్రంగా పరిశీలన చేస్తూ కాంట్రాక్టర్లపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి.

**రెండు నెలలుగా తప్పని అవస్థలు :**
రామంతాపూర్ వివేక్‌నగర్‌లో వరద నీటి కాలువ పనుల కోసం గుంతలు తవ్వారని, రోడ్డు దాటేందుకు కూడా ఇబ్బందులు వస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఉదయం, రాత్రి వేళలలో తాత్కాలికంగా వేసుకున్న కట్టెల మీదుగా రోడ్డు దాటుతున్నామని, వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా తయారైందని స్థానికులు పేర్కొంటున్నారు. రామంతాపూర్ బైపాస్ రోడ్డు నాలా ఎత్తుగా ఉండడంతో ఈ నాలా నుంచి వరద నీరు వెళ్లకుండా మధ్యలోనే ఉండిపోయింది. అధికారులు ఒక ప్రణాళిక లేకుండా పనులు చేపడుతున్నారని, పలు కాలనీల నుంచి వచ్చే డ్రైనేజీ నీటితో తమకు అవస్థలు తప్పడం లేదని వారు వాపోతున్నారు. కాగా డ్రైనేజీ కనెక్షన్లు కూడా వరద నీటి కాలువకు కలుపడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని మరికొందరు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## అద్దె భవనంలో ప్రభుత్వ ఆసుపత్రి

### -పెరుగుతున్న ఓపి.. సౌకర్యాలు లేక ఇబ్బంది
### -సొంత భవనం నిర్మించాలని డిమాండ్



అద్దె భవనంలో ఆసుపత్రి దృశ్యం

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 26 ప్రభాతవార్త:**
సరైన సౌకర్యాలు లేదా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనంలో ప్రభుత్వ ఆసుపత్రి కొనసాగుతున్నప్పటికీ ఇరుకైన చిన్న గదులతో ఇబ్బందులు తప్పడం లేదు. అటు వైద్యులు, సిబ్బందితోపాటు రోగులు కూడా ఆసుపత్రిలో అగచాట్లు పడుతున్నారు. కొత్తపేట డివిజన్ కొత్తపేట ఎస్సీ బస్తీలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అసౌకర్యాలకు నిలయంగా మారింది. ప్రతిరోజు వివిధ చికిత్సల కోసం సుమారు వందమందికిపైగా ఆసుపత్రికి వస్తుంటారు. ఆసుపత్రిలో కేవలం మూడు గదులు మాత్రమే ఉన్నాయి. అవి కూడా చిన్నగా ఉండడంతో నలుగురు ఐదుగురు కూడా నిలబడలేని పరిస్థితి. ఒక వైద్యుడు, 21 మంది ఆశా వర్కర్లు, నలుగురు ఏఎన్ఎంలు, ఐదుగురు సిబ్బంది ఆసుపత్రిలో విధుల్లో పాల్గొంటున్నారు. ఆసుపత్రిలో రోగులకు ఉత్తమ సేవలు లభిస్తున్నప్పటికీ సౌకర్యాలు లేక నానా ఇక్కట్లు పడాల్సి వస్తోంది. వైద్యులు పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరం ఉన్నవారికి వివిధ పరీక్షలు కూడా నిర్వహిస్తూ రోగులకు ఉత్తమ సేవలు అందిస్తున్నారు. అయితే చిన్న అద్దె భవనంలో కేవలం 3 చిన్నచిన్న గదులు మాత్రమే ఉండడం అటు వైద్య సిబ్బందికి, ఇటు రోగులకు కూడా అసౌకర్యంగా మారింది. రోగులకు ఉత్తమ సేవలు అందించడంతోపాటు అన్ని రకాల మందులు ఇస్తూ అన్ని రకాల పరీక్షలు చేస్తున్న ఆసుపత్రికి సొంత భవనం నిర్మించాలని లేకుంటే పెద్ద అద్దె భవనం ఏర్పాటు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

## పేదల పక్షాన పోరాటాలు చేసి ఘన చరిత్ర సిపిఐది : కామ్రేడ్ అజీజ్ పాష


సిపిఐ పతాకాన్ని ఎగురవేసిన మాజీ ఎంపి కామ్రేడ్ అజీజ్ పాష

**సరూర్‌నగర్, డిసెంబరు 26 ప్రభాతవార్త:** దేశంలో పేదల పక్షాన నిలబడి పోరాటాలు చేసిన ఘన చరిత్ర సిపిఐ పార్టీకి ఉందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు కామ్రేడ్ అజీజ్ పాష స్పష్టం చేశారు. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్‌లోనున్న బాలాపూర్ మండల సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన సిపిఐ ఆవిర్భావ శతాబ్ది వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సిపిఐ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో అదే విధంగా తెలంగాణ సాయుధ పోరాటంలో చాలా మంది కమ్యూనిస్టు యోధులు అమరులయ్యారని గుర్తు చేశారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి దేశం కోసం త్యాగాలు చేసిన మహనీయులు ఎంతో మంది పార్టీకి సేవలందించారని పాషా వివరించారు. దేశం లో ఆర్థిక అసమానతలను రూపొందించి ప్రజలందరికీ సమాన హక్కుల కోసం అదే విధంగా పేదలకు న్యాయం జరగడానికి సిపిఐ రాజీలేని పోరాటం చేసిందని ఆయన స్పష్టం చేశారు. దోపిడీ లేని సమాజం కోసం, భూమి లేని రైతులు, ఇళ్లు లేని పేదలు, కార్మికులు, రైతు కూలీల కోసం నేటికీ సిపిఐ అలుపెరుగని పోరాటాలు చేస్తుందని ఆయన వెల్లడించారు. సిపిఐ శతాబ్ధి ఆవిర్భావ వేడుకల సందర్భంగా మరింత ఉత్సాహంతో పార్టీ నాయకత్వం పని చేస్తుందని అజీజ్ పాష తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, పార్టీ నాయకులు పిచ్చిరాజు, ముకుందంగారి చంద్రశేఖర్‌రెడ్డి, జర్పుల శివనాయక్, బండ యాదమ్మ యాదవ్, జాజాల అంజయ్య, రమావత్ చత్రు నాయక్, జఠావత్ రెడ్యా నాయక్, సోమ్యా నాయక్, హుసేన్, విజయ్‌కుమార్, వడిత్య దత్తు నాయక్, శ్రీనివాస్, మహిళా కామ్రేడ్లు మిర్యాల లక్ష్మమ్మ, బి.నాగమణి, రజిత, లక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## సైలెన్సర్ల తొలగింపునకు ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్


ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్‌లో అక్రమంగా అమర్చిన సైలెన్సర్‌లను తొలగించిన సిఐ మల్లేష్, బాబ్యానాయక్ తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 26 ప్రభాతవార్త :**
రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్‌లో గురువారం ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు మల్లేష్, బాబ్యానాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అక్రమంగా బుల్లెట్ వాహనాలకు అమర్చిన సైలెన్సర్లను తొలగించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న బుల్లెట్ వాహనాల సైలెన్సర్లు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే పోలీసులు పట్టుకుని జరిమానా విధిస్తారని తెలిపారు. ఒక్కో బైకర్‌కు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు తెలిపారు. రెండోసారి నిబంధనలు ఉల్లఘించి పట్టుబడితే చార్జిషీటు దాఖలు చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. వాహనదారులు కొత్త సంవత్సరం వేడుకలలో నిబంధనలు పాటించాలని సూచించారు. లేకుంటే వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం మొత్తం 40కి పైగా వాహనాలు పట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రమేష్, నరేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డుకు మరమ్మత్తులు


క్రిస్టల్ విల్లా వద్ద గుంతలు పడ్డ రోడ్డు ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం. డిసెంబరు. 26.ప్రభాతవార్త.**
బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎపిఆర్ క్రిస్టల్ విల్లాస్ వద్ద రోడ్డు గుంతలుపడి వాహనదారులకు ఇబ్బందికరంగా ఉందని బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి రోడ్డుకు మరమ్మతు పనులు చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా మరమ్మతు పనులు పూర్తి చేయాలని,ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శరవేగంగా పనులు పూర్తిచేయాలని సంబంధిత సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిఆర్ క్రిస్టల్ విల్లా అధ్యక్షులు సత్యనారాయణ, శ్యామ్ సుందర్, మరియు పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

### వేం నరేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన మధుసూధన్‌రెడ్డి


వేం నరేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న చిలుక మధుసూధన్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 26 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూధన్‌రెడ్డి గురువారం గచ్చిబౌలిలోని ఆయన నివాసానికి తరలివెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

### చిలుకానగర్‌లో ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ


చిలుకానగర్‌లో జరిగిన అయ్యప్ప మహాపడిపూజలో పాల్గొన్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 26 ప్రభాతవార్త :** చిలుకానగర్‌లోని చిలుకేశ్వర అంజనేయస్వామి ఆలయంలో అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో గురువారం అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి స్తానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అయ్యప్పస్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాక్షించినట్లు తెలిపారు. అయ్యప్పస్వామి పూజలు ఆనందోత్సవాలతో చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట శంకర్, బిఆర్ఎస్ సీనియర్ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొక్కొండ జగన్, ఏదుల కొండల్‌రెడ్డి, శ్యామ్, స్థానిక నేతలు బూర్గుల రమేష్‌గౌడ్, దాసరి కృష్ణ, అమృత్‌రావు, వాసు,శ్రీనివాస్‌రెడ్డి, అనసూయ,బాబు తదితరులు పాల్గొన్నారు.

### వేం నరేందర్‌రెడ్డితో కాంగ్రెస్ ఇంచార్జీ పరమేశ్వర్‌రెడ్డి బేటి


సిఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 26 ప్రభాతవార్త :** సిఎం రేవంత్‌రెడ్డి ముఖ్య సలహదారుడు వేం నరేందర్‌రెడ్డితో గురువారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్, భూపతి రెడ్డిలు బేటి అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వేం నరేందర్‌రెడ్డి సహకారంతో ఉప్పల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. నరేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

### కారుణ్య సంధులో ఘనంగా వీర్ బాల దివస్ వేడుకలు



**సైదాబాద్, డిసెంబరు 26 ప్రభాతవార్త:** సైదాబాద్‌లోని కరుణశ్రీ సేవా సమితి కారుణ్య సింధు ఆశ్రమంలో గురువారం వీర్ బాల దివస్‌ను ఘనంగా నిర్వహించారు. అఖిల భారత ప్రశిక్షణ సభ్యుడు రామచంద్రయ్య ముఖ్యఅతిథిగా హాజరై ఆశ్రమంలోని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో ఒకనాడు ఏడు లక్షల ఇరవై గురుకుల ఆశ్రమాలు ఉండేవని, దేశ విదేశాల నుంచి వచ్చే వారు ఇక్కడి గురువులు అందించే అన్ని విద్యలు నేర్చుకుని సంస్కార వంతులుగా, యోగ్యులుగా వెళ్లే వారని అన్నారు. ప్రహ్లాదుడిలా దైవం పట్ల భక్తి, విశ్వాసాలు కలిగి ఉండాలన్నారు. సిక్కు గురువు గురు గోవిందసింగ్, అతని పుత్రులు జోదావర్ సింగ్, ఫతేసింగ్‌లు దేశం కోసం, ధర్మంనకోసం సజీవ సమాధి కావడం జరిగిందని, అందువల్లే ఈ రోజును మనం వీర్‌బాల దివస్‌గా జరుపుకుంటున్నామని అన్నారు. ఛత్రపతి శివాజి, అతని కుమారుడు శంభాజీ వలె మనం కూడా దేశ భక్తులుగా, ధర్మ వీరులుగా తయారు కావాలన్నారు. ఈ కార్యక్రమాన్ని కార్యదర్శి పుప్పాల వెంకటేశ్వర్‌రావు నిర్వహించగా సమితి అధ్యక్షుడు కడారి సత్యమూర్తి, ఆశ్రమ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, శంకర్, ఈరన్న, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు మొగుళ్ళపల్లి ఉచిత వివాహం


వాతావరణం ఆశీర్వదిస్తున్న ఉపేందర్ గుప్తా

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** మొగుళ్ళపల్లి యువసేన ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత వివాహాన్ని సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. నిరుపేదలకు దివ్యాంగులకు మొగుళ్లపల్లి యువ సేన, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు డాక్టర్ మొగుళ్ళపల్లి ఉపేందర్ గుప్తా ఆధ్వర్యంలో 216వ ఉచిత వివాహం దివ్యాంగులైన మమత, సురేందర్ లకు గురువారం ఉదయం 11.40 గంటలకు హిందూ సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. పందిరి, రెండు బంగారం పుస్తెలు, మట్టెలు, స్టీల్ సామాను, పెళ్లి బట్టలు అన్ని వస్తువులతో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం నిర్వహించినట్లు ఉపేందర్‌గుప్త తెలిపారు. కోటగిరి సుధాకర్. ఉదయలక్ష్మి , కోటగిరి సచిన్, సంధ్య దంపతుల సహకారంతో వివాహం జరిగిందన్నారు. ఎంతోమంది మిత్రులు బంధువులు, దాతల సహాయ సహకారంతో నిరంతరం వివాహాలు జరిపిస్తున్నామన్నారు. నిరుపేదలకు పెళ్ళి, చదువు ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నమాన్నారు.

## పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే


జెండా ఆవిష్కరణ చేస్తున్న నాయకులు

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** సిపిఐ 100 వసంతాల ఉత్సవాల్లో భాగంగా సిపిఐ సరూర్నగర్ మండల సహాయ కార్యదర్శి కందుల సుధాకర్ అధ్యక్షతన నాగోల్ డివిజన్ నాంచారమ్మ బస్తి డబల్ బెడ్ రూమ్ వద్ద రంగారెడ్డి జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు బాతరాజు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేకమంది అమరవీరులు, తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలను అందించిన ఘనత సిపిఐ పార్టీది అని కొనియాడారు. వారి ఆశయ సాధన కోసం నిరంతరం కమ్యూనిస్టు పార్టీ నాయకులు పేదల పక్షాన పోరాడుతూనే ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పూజారి అనిత, జి. శోభ, లింగస్వామి, శ్రీనివాస్, దుండిగల్ లక్ష్మి, కట్ట పార్వతమ్మ, యాదిరెడ్డి, విక్రం పాల్గొన్నారు.

## త్యాగాల చరిత్ర కమ్యూనిస్టులది


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** సిపిఐ 100 సంవత్సరల వేడుకలు రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు సామిడి శేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి హాజరై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అరుణ పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్యాగాల చరిత్ర కమ్యూనిస్టులదని, దేశ స్వాతంత్రం, కార్మికుల హక్కులకు, వెట్టిచాకిరి విముక్తి, ఫ్యూడల్ ప్రభువుల విముక్తి, తెలంగాణ సాయుధ పోరాటం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు భాతరాజు నరసింహ, ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి, కందుల సుధాకర్, బోయపల్లి రాములు గౌడ్, శ్రీదేవి, అరుణ్ శోభన్, రామావత్ సకురు నాయక్ పాల్గొన్నారు.

## అప్పన్నగారి లింగారెడ్డికి సబితమ్మ నివాళి


విలపిస్తున్న లింగారెడ్డి సతీమణిని ఓదారుస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబరు 26 ప్రభాతవార్త:** హఠాన్మరణం చెందిన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని గాయత్రీ హోమ్స్ కాలనీ పెద్దలు, స్థానిక సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యుడు అప్పన్నగారి లింగారెడ్డి భౌతిక కాయానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి నివాళులర్పించారు. లింగారెడ్డి ఆకస్మిక మరణవార్త తెలియగానే స్పందించిన సబితా ఇంద్రారెడ్డి గురువారం ఉదయం గాయత్రీహోమ్స్ కాలనీలోని ఆయన నివాసానికి వచ్చి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ లింగారెడ్డి లేని లోటు కాలనీకి తీర్చలేనిదని విచారం వ్యక్తం చేశారు. సబితారెడ్డి వెంట ఉండి పరామర్శించిన వారిలో మీర్‌పేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్లు బొక్క రాజేందర్‌రెడ్డి, సిద్దాల లావణ్య బీరప్ప, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, నాయకులు వంటేరు నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.


బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లో జరిగిన క్రిస్మస్ సంబరాల్లో పాల్గొని చిన్నారులతో కలిసి కేకును కట్ చేస్తున్న మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి (సరూర్‌నగర్, ప్రభాతవార్త)